# వేగంగా సచివాలయ నిర్మాణం


## ఫర్నీచర్ విషయంలో నూతన మోడల్స్ ఎంపిక చేసుకోవాలి: సెక్రటేరియట్ పనులను పరిశీలించిన సిఎం కెసిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఆగస్టు17:** నాణ్యతలో ఏమాత్రం రాజీపడకుండా నూతన సెక్రటేరియట్ నిర్మాణ పనులను సాధ్యమైనంత వేగంగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు ఆర్ అండ్ బి మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డిని, అధికారులను ఆదేశించారు. సెక్రటేరియట్‌లోని అన్ని విభాగాల పనులను అద్భుతంగా, సుందరంగా తీర్చిదిద్దాలని సూచించారు. నూతనంగా నిర్మిస్తున్న సచివాలయం నిర్మాణ పనులను ముఖ్యమంత్రి కెసిఆర్ బుధవారం సాయంత్రం పరిశీలించారు. సెక్రటేరియట్‌లో జరుగుతున్న నిర్మాణాలన్నింటినీ ముఖ్యమంత్రి కలియ తిరుగుతూ నిశితంగా పరిశీలించారు. తొలుత నిర్ధేశించుకున్న డిజైన్ల ప్రకారం పనులు జరుగుతున్నాయా? అని మంత్రిని, అధికారులను సిఎం అడిగి తెలుసుకున్నారు. ఏక కాలంలో అన్ని పనులు వేగంగా పూర్తి చేయడానికి అవసరమైన అన్ని చర్యలు,జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పనులు ఆలస్యం కావద్దని పేర్కొన్నారు. స్లాబుల నిర్మాణం, భవనంపైన డూమ్స్ ఏర్పాటు,ఇంటీరియర్ పనులతో పాటు ఫర్నీచర్ విషయంలో నూతన మోడల్స్ ఎంపిక చేసుకోవాలని సిఎం సూచించారు. మంత్రుల ఛాంబర్లు,మీటింగ్ హాల్స్,యాంటీ టీమ్స్


బుధవారం సచివాలయ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న సిఎం కెసిఆర్

నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. భవనం మధ్య భాగంలో సుమారు 2 ఎకరాల ఖాళీ స్థలంతో పాటు సెక్రటేరియట్ ప్రాంగణంలో గ్రీనరీ,ల్యాండ్ స్కేపింగ్ పనులు అద్భుతంగా ఉండేలా తీర్దిదిద్దాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. గ్రిల్స్ నిర్మాణ పనుల నాణ్యత గురించి సిఎం ఆరా తీశారు. రెడ్ స్టోన్,డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలించారు. విజిటర్స్ లాంజ్ నిర్మాణ పనులను,సెక్రటేరియట్ వాల్ వెంబడి మట్టి ఫిల్లింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. సెక్రటేరియట్‌కు వచ్చే విదేశీ ప్రతినిధులు,మంత్రులు,ఎంపీలు,ఎమ్మెల్సీ లు,ఎమ్మెల్యేలు, సందర్శకులకు సౌకర్యవంతంగా ఉండేలా పార్కింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. వివిధ జిల్లాల నుంచి సెక్రటేరియట్‌కు వచ్చే ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలకు సౌకర్యంగా ఉండేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సిఎం కెసిఆర్ సూచించారు. మంత్రులు, సెక్రటరీలు, ఆయా శాఖల సిబ్బంది సౌకర్యవంతంగా పనులు చేసేందుకు వీలుగా చాంబర్ల నిర్మాణం చేపట్టా లన్నారు. నిర్మాణంలో ఉన్న సెక్రటేరియట్‌లోనే... పనులు జరుగుతున్న తీరు గురించి సిఎం కెసిఆర్ సమీక్ష జరిపారు. పనులకు సంబంధించిన ఆల్బమ్‌ను పరిశీలిస్తూ,ఒక్కో పని గురించి సమగ్రంగా అడిగి తెలుసుకున్నారు. సెక్రటేరియట్ పనుల పరిశీలనలో సిఎం కెసిఆర్‌తో పాటు మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, చామకూర మల్లారెడ్డి,రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్‌కుమార్, రాజ్యసభ సభ్యుడు దీవకొండ దామోదర్‌రావు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు,ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, కెపి వివేకానంద,మైనంపల్లి హనుమంతరావు, ఎ.జీవన్‌రెడ్డి, ఎమ్మెల్సీ లు బేతి సుభాష్‌రెడ్డి, కె.నవీన్‌కుమార్, సిఎం సెక్రటరీ స్మితా సభర్వాల్,రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ వేద సాయిచంద్,ఆర్ అండ్ బి ఈఎన్సీ గణపతిరెడ్డి, ప్రభుత్వ నిర్మాణ సలహాదారు సుద్దాల సుధాకర్ తేజ, జిహెచ్ఎంసీ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్,నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# డిజైన్ లోపం అన్నారం పంప్ హౌజ్‌కు శాపం



### ప్రాజెక్టుల సందర్శనకు వెళ్లిన సిఎల్‌పి బృందాన్ని అడ్డుకోవాల్సిన అవసరం ఏముంది?
### వేల కోట్ల నష్టం వాటిల్లిందని ఇంజినీరింగ్ నిపుణులు అంటున్నారు
### టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 17 ప్రభాతవార్త:** కాళేశ్వరంతో పాటు టిఆర్ఎస్ అవినీతి కారణంగా నిండా మునిగినా సాగునీటి ప్రాజెక్టుల వాస్తవ పరిస్థితిని ప్రజల ముందు పెట్టేందుకు ప్రాజెక్టుల సందర్శనకు వెళ్లి సిఎల్‌పి నేత భట్టి విక్రమార్క బృందాన్ని అడ్డుకోవాల్సిన అవసరం ఏమొచ్చిందని టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. మంగళవారం సైతం ప్రభుత్వంనప్రాజెక్టుల సందర్శనకు వెళ్లిన కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు భట్టి విక్రమార్క, జీవన్‌రెడ్డి, సీతక్క, శ్రీధర్‌బాబు, పోదెం వీరలయ్యలను అరెస్టు చేసి పిరికిపందలా వ్యవహరించిందన్నారు. గత నెలలో వరదలు వచ్చినప్పుడే కాళేశ్వరంతో పాటు ఇతర ప్రాజెక్టులకు భారీ నష్టం జరిగిందని మేము చెబితే ప్రభుత్వం మా మాటలను పట్టించుకోకుండా మూర్ఖంగా వ్యవహరించిందన్నారు. గోదావరి వరదల వల్ల జూలై 14న అన్నారం, కన్నెపల్లి పంప్‌హౌజ్‌లు నీట మునిగాయన్నారు. కన్నెపల్లి పంప్‌హౌజ్‌లో క్వాలిటీ లేకుండా కట్టిన ప్రొటెక్షన్ వాల్, దాంతో పాటు క్రేన్‌లు, లిఫ్టులు కూలడంతో మోటార్లు తక్కుతుక్కు అయ్యాయన్నారు. డిజైన్ లోపం అన్నారం పంప్‌హౌజ్‌కు శాపంగా మారిందన్నారు. ఫలితంగా వేల కోట్లనష్టం వాటిల్లిందని ఇంజనీరింగ్ నిపుణులు అంటున్నారన్నారు. వాస్తవాలు ఇలా ఉంటే ప్రభుత్వం మాత్రం అత్యంత బాధ్యతారాహిత్యంగా కేవలం రూ.25కోట్ల నష్టం మాత్రమే జరిగిందని, ఆ నష్టం కూడా కాంట్రాక్టు సంస్థే భరిస్తుందని నీటిపారుదల ముఖ్యకార్యదర్శి రజత్‌కుమార్‌తో అబద్దాలనుప్రచారం చేయించిందన్నారు. ఈ మొత్తం వ్యవహారంలో వాస్తవాలను ప్రజల ముందు ఉంచేందుకు వెళ్తున్న సిఎల్‌నేత భట్టి విక్రమార్క నేతృత్వంలోని కాంగ్రెస్ బృందాన్ని పదేపదే అడ్డుకుంటున్నారన్నారు. ప్రాజెక్టులు ఉన్న ప్రాంతంలో శాంతి భద్రత సమస్యలు లేవని, కాంగ్రెస్ ప్రజాప్రతి నిధులు వెళ్లి అక్కడ విధ్వంసం సృష్టించే పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వంతో సమానంగా ప్రజలకు వాస్తవాలను వివరించాల్సిన బాధ్యత ప్రతిపక్ష పార్టీల మీద కూడా ఉందన్నారు.ప్రాజెక్టులను సందర్శించకుండా ప్రభుత్వంఆంక్షలు విధిస్తూ నిరకుశంగా వ్యవహారిస్తుందన్నారు.నిజంగా కాళేశ్వరం ప్రాజెక్టులో ఏమీ నష్టం జరగకుంటే దాన్ని చూపించడానికి కెసిఆర్ ఎందుకు వణుకుతున్నారన్నారు.పంప్‌హౌజులు మునగకుండా మోటార్లు విధ్వంసంకాకుంటే కాళేశ్వరం ప్రాజెక్టును ప్రజలకు చూపించాలన్నారు.వాస్తవాలుబయటకు వస్తాయనే సిఎల్‌పిబృందం పర్యటనకు ప్రభుత్వం అడ్డుపడు తుందన్నారు. ప్రజలకు వాస్తవ పరిస్థితులను వివరించడానికి ప్రాజెక్టుల సందర్శనకు వెళ్లిన సిఎల్‌పి నేత, బృందాన్ని అరెస్టు చేయడానికి ఖండిస్తున్నామని,అరెస్టు చేసిన వారిని తక్షణమే విడుదలచేయాలన్నారు. దగ్గరుండి ప్రాజెక్టులను ప్రభుత్వమే చూపించాలని, లేని పక్షంలో కాంగ్రెస్ పార్టీ తరుపున పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు.

## నేడు రాష్ట్రానికి తరుణ్‌చుగ్

**హైదరాబాద్, ఆగస్టు 17 ప్రభాతవార్త:** బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ తరుణ్‌చుగ్ గురువారం తెలంగాణలో పర్యటించనున్నారు. ఉదయం 11.30గంటల నుంచి మధ్యాహ్నాం 1గంట వరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శులతో సమావేశం నిర్వహించనున్నారు. అనంతరం జగిత్యాల జిల్లాకోరుట్లలో సాయంత్రం 4గంటలకు జరిగే బహిరంగ సభలో పాల్గొం టున్నారు. ఈ బహిరంగ సభలో వివిధ పార్టీలకు చెందిన పలువురు నేతలు తరుణ చుగ్‌సమక్షంలో బిజెపిలో చేరుతున్నారు.ఈ బహిరంగ సభలో ఎంపి అరవింద్, ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిలు పాల్గొననున్నారు.

## క్రీడలతో తెలంగాణకు పేరు ప్రఖ్యాతులు తీసుకు రావాలి: మంత్రి శ్రీనివాస్ గౌడ్

**హైదరాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త :** క్రీడాకారులు తమ ప్రతిభతో అంతర్జాతీయ స్థాయిలో రాణించి తెలంగాణకు పేరు ప్రఖ్యాతులు తీసుకు రావాలని రాష్ట్ర ఆబ్కారీ, టూరిజం, సాంస్కృతిక శాఖ మంత్రి వి.శ్రీనివాసగౌడ్ అన్నారు. బుధవారం ఇక్కడి క్యాంపు కార్యాలయంలో సాట్స్ షూటింగ్ రేంజ్‌కు చెందిన షూటింగ్ క్రీడాకారులు ఇటీవల జరిగిన సౌత్ జోన్, ఫ్రీ నేషనల్స్ కోసం జరిగిన సెలక్షన్‌లో ఎంపికైన షూటింగ్ క్రీడాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జాతీయ హ్యాండ్‌బాల్ ఫెడరేషన్ అధ్యక్షుడు జగన్మోహన్, టీజీవో అసోసియేషన్ కోశాధికారి రవీందర్ కుమార్, షూటింగ్ రేంజ్ అడ్మిన్ అలెగ్జాండర్, సాట్స్ అధికారులు ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఇక ఎటిఎం నగదు విత్‌డ్రాపై బాదుడు

**హైదరాబాద్, అగస్టు 17, ప్రభాతవార్త:** ఇక నుండి ఏటిఎంల నుండి నగదు విత్ డ్రా చేస్తే బాదుడు కార్యక్రమాన్ని బ్యాంకులు ప్రారంభించనున్నాయి. ఉచిత లావాదేవీలను పరిమితం చేయడంతోపాటు, దాన్ని మించి నగదును విత్ డ్రా చేస్తే ఇందుకు గాను ప్రతీ లావాదేవీకి చార్జీలు వసూలు చేయనున్నాయి. ఖాతాదారులు ప్రతీ నెల తమ బ్యాంకు ఏటీఎం నుండి ఉచితంగా 5 లావాదేవీల వరకూ నిర్వహించుకోవచ్చు. ?తర బ్యాంకుల ఏటీఎంల నుండి అయితే మూడు ఉచిత లావాదేవీలు నిర్వహించుకునే వెసులుబాటు ఉంది. అదే నాన్ మెట్రో కేంద్రాల్లోని ఖాతాదారులు ఇతర బ్యాంకు ఏటీఎంలలో ఐదు లావాదేవీలను ఉచితంగా చేసుకోవచ్చు. ఈ పరిమితి దాటితే ప్రతీ లావాదేవీపైనా బాదుడు తప్పదు. కాగా ఈ నెల 1వ తేదీ నుండి ఆర్థిక లావాదేవీకి 17రూపాయలు, ఆర్థికేతర లావాదేవీకి 6రూపాయల చొప్పున ఇంటర్ చేంజ్ రుసుమును వసూలు చేసుకునేందుకు అన్ని బ్యాంకులకు రిజర్వ్ బ్యాంక్ అనుమతినిచ్చింది.ఖాతా రకం, డెబిట్ కార్డుల ఆధారంగా ఏటీఎంలో ఉచితలావాదేవీల సంఖ్య విషయంలో మార్పులు ఉంటాయి. దీనికి సంబంధించి దేశంలోని అన్నిప్రభుత్వ,ప్రైవేటు రంగ బ్యాంకులు నిర్ణయం తీసుకున్నాయి. పరిమితి దాటిన తర్వాత ఆర్థిక, ఆర్థికేతర సేవలపై చార్జీలను విధించనున్నాయి. కాగా ఏటీఎంలలో ఉచిత లావాదేవీలు పరిమితికి మించితే ఈ ఏడాది జనవరి 1వ తేదీ నుండి ప్రతీ లావాదేవీకి 21 రూపాయల చార్జ్‌ను వసూలు చేసేందుకు బ్యాంకులకు రిజర్వ్ బ్యాంక్ అనుమతినిచ్చింది. గతంలో ఈ చార్జ 20 రూపాయల ఉంది.

## 22 నుంచి డీఈఈసెట్-2022లో క్వాలిఫైయర్ల సర్టిఫికెట్ వెరిఫికేషన్
### ఉమ్మడి 10 జిల్లాల్లోని డైట్ కాలేజీల్లో పరిశీలన: కన్వీనర్ శ్రీనివాస్ చారి

**హైదరాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** రాష్ట్రంలో డిప్లమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఈఐఈడీ), డిప్లమా ఇన్ ప్రీస్కూల్ ఎడ్యుకేషన్(డీపీఎస్ఈ)లో అడ్మిషన్ల కోసం నిర్వహించిన డీఈఈసెట్-2022లో క్వాలిఫై అయిన వారికి సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను ఈ నెల 22 నుంచి ప్రారంభించనున్నారు. 22 నుంచి 25 వరకు ఉమ్మడి 10 జిల్లాల్లో ఉన్న డైట్ కాలేజీల్లో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహిస్తున్నట్లు డీఈఈసెట్-2022 కన్వీనర్ శ్రీనివాసచారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.డీఈఈసెట్‌ను జులై 23న నిర్వహించిన సంగతి తెలిసిందే. తెలుగుమీడియంలో 4,967మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 3,572 మంది హాజరయ్యారు. అందులో 2765 మంది(77.40 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఇంగ్లీష్ మీడియంకు 5348 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 3974 మంది పరీక్షకు హాజరు కాగా వారిలో 3132 మంది(78.81 శాతం) పాసయ్యారు. ఉర్దూ మీడియంకు 1365 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 1099 మంది పరీక్షకు హాజరయ్యారు. అందులో 653 మంది(59.41 శాతం) పాసయ్యారు. అర్హత సాధించిన విద్యార్థులందరూ తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈ నెల 22 నుంచి 25 వరకు జరిగే సర్టిఫికేషన్‌లో పాల్గొనాలని సూచించారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ అనంతరం సీట్ల కేటాయింపు చేపట్టనున్నారు.

## రైతు బీమాలో కొత్తగా 3.7 లక్షల మంది చేరిక

**హైదరాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** అన్నదాతల కోసం తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు బీమా పథకానికి లబ్దిదారుల సంఖ్య పెరిగింది. 2022-23 సంవత్సరానికిగాను కొత్తగా 3.7 లక్షల మంది రైతులు ఈ బీమా పథకంలో చేరినట్లు వ్యవసాయ శాఖ అధికవర్గాలు వెల్లడించాయి. గత ఏడాది వరకూ 35.64 లక్షల మంది లబ్దిదారులు ఉండగా, తాజాగా పెరిగిన వారితో కలిపి మొత్తం 39.34 లక్షల మందికి చేరింది. ఈ ఏడాది బీమా నిమిత్తం 1,446 కోట్ల రూపాయల మేర జీవిత బీమా సంస్థకు చెల్లించాల్సి ఉంటుందని అంచనా వేస్తున్నారు. కాగా తెలంగాణలో రైతు బీమా పథకం 2018 సంవత్సరంలో ప్రారంభం అయింది. 2018-19 సంవత్సరంలో రైతు బీమాలో చేరినవారిలో 17,666 మంది మరణించగా, వీరికి 883.30 కోట్ల రూపాయలను జీవిత బీమా చెల్లించింది. అలాగే 2019-20 సంవత్సరంలో 19,019 మంది మరణించగా వీరికి 950.95 కోట్ల రూపాయలు, 2020-21 సంవత్సరంలో 28,989 మంది రైతులు ప్రాణాలు కోల్పోగా వారి కుటుంబాలకు 1,449,45 కోట్ల రూపాయలు, 2021-22 సంవత్సరంలో బీమా చేసిన వారిలో 20,130 మంది రైతులు మృతి చెందగా, బీమా పరిహారం కింద వీరి కుటుంబాలకు 1,006.50 కోట్ల రూపాయలను జీవిత బీమా సంస్థ చెల్లించింది. ఈ విధంగా 2018 సంవత్సరం నుండి ఇప్పటి వరకూ రైతు బీమా పథకంలో చేరిన వారిలో 85 వేల మంది రైతులు మరణించారు. బీమా పరిహారం కింద సంబంధిత రైతు కుటుంబాలకు జీవిత బీమా సంస్థ 4,290 కోట్ల రూపాయలను పరిహారంగా పంపిణీ చేసిందని వ్యవసాయ శాఖ అధికారులు వెల్లడించారు.

## దేశంలో ప్రధాన సమస్యలు పేదరికం,నిరుద్యోగం,మతతత్వం
## తెలంగాణ భవన్‌లో రక్తదానం చేసిన ఎమ్మెల్సీ కవిత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, ఆగస్టు17:** దేశంలో ఉన్న ప్రధాన సమస్యలైన పేదరికం,నిరుద్యోగం,మతతత్వాన్ని సమూలంగా రూపుమాపితే,స్వాతంత్ర్యం వచ్చి వందేళ్ల పూర్తయ్యేలోపు భారతదేశం,ప్రపంచంలో నంబర్ వన్ శక్తిగా ఎదిగే అస్కారం ఉంటుందని ఎమ్మెల్సీ కవిత తెలిపారు. స్వతంత్ర భారత వజ్రోత్సవాల్లో భాగంగా తెలంగాణ భవన్‌లో బుధవారం నాడు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్సీ కవితతో కలిసి ఎంపీ కె.కేశవరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత రక్తదానం చేశారు. అనంతరం కవిత మాట్లాడుతూ స్వాతంత్ర్య వజ్రోత్సవాల్లో భాగంగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామని చెప్పారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ విధానాలను ఎండగట్టారు. రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను ఉచితాలంటూ కేంద్రం విమర్శించడం సరైంది కాదన్నారు. దేశాన్ని పట్టిపీడిస్తున్న



ప్రధాన సమస్యల్లో పేదరికం ఒకటని, పేదలు అభివృద్ధి చెందాలంటే వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుందని చెప్పారు. అణగారిన వర్గాల అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపట్టే పథకాలపై కేంద్రం విమర్శలు చేయడం సరైంది కాదని హితవు పలికారు. దేశం బాగుండాలంటే ప్రజలు బాగుండాలని తెలిపారు. నిరుద్యోగం,మతత్వాన్ని సమూలంగా దేశంనుంచి రూపుమాపాలని వెల్లడించారు. ప్రపంచానికి దిక్సూచిలా భారతదేశం ఎదగాలన్నారు. సిఎం కెసిఆర్ తెలంగాణలో అమలు చేస్తున్న కార్యక్రమాలు దేశ వ్యాప్తంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని కవిత పేర్కొన్నారు. దేశంలో ప్రస్తుతం ఉన్న పరిస్థితులను ఏ విధంగా మా ర్చాలనే అంశంపై దేశ పౌరులందరూ ఆలోచన చేయాలని పిలునిచ్చారు. దేశ అభ్యున్నతి కోసం మనమంతా పునరంకితమవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మాగంటిగోపినాథ్, దానం నాగేందర్,హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మీ, కార్పొరేషన్ చైర్మన్లు మేడే రాజీవ్ సాగర్,గజ్జెల నగేశ్, మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్, విప్లవ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌బిఐ డోర్ స్టెప్ సర్వీస్

**హైదరాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** ఆజాదీ కా అమృత మహోత్సవ్ వేడుకల నేపథ్యంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖాతాదారుల కోసం బంపరాఫర్‌ను ప్రకటించింది. ఇక నుండి ఇంటి వద్ద నుండే (డోర్ స్టెప్ సర్వీస్) బ్యాంకింగ్ సేవలను పొందే అవకాశం కల్పిస్తూ నిర్ణయం తీసుకుంది. అయితే ఈ సేవలను కేవలం సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులతో పాటు, బ్యాంకుకు రాలేని దీర్ఘకాలిక అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఈ డోర్ స్టెప్ సర్వీసులను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ మేరకు వీటికి సంబంధించి ఎస్‌బిఐ తన అధికారిక ట్విట్టర్ ఖాతాలో వివరాలను వెల్లడించింది. నగదు డిపాజిట్, ఉపసంహారణ, చెక్ బుక్, చెక్ రిక్వెషన్ స్లిప్, ఫామ్ 15 జీ/హెచ్ పికప్, డ్రాఫ్ట్‌ల డెలివరీ, టర్మ్ డిపాజిట్ అడ్వైజ్ డెలివరీ, లైఫ్ సర్టిఫికెట్, కేవైసీ డాక్యుమెంట్ పికప్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ సేవలను పూర్తి ఉచితంగా అందించనున్నట్లు తెలిపింది. కానీ ఈ సేవలు వినియోగించుకోవడంలో నిబంధన విధించింది. కేవలం నెలకు మూడు సార్లు మాత్రమే ఈ సేవలను ఉచితంగా పొందే అవకాశాన్ని కల్పించింది. ఈ సేవలను పొందాలనుకునే ఆయా ఖాతాదారులు ముందుగా యోనో యాప్‌ను ఓపెన్ చేయాల్సి ఉంటుంది. తర్వాత సర్వీసెస్ రిక్వెస్ట్ మెనూలోకి వెళ్లాలి. అందులో ఉండే డోర్ స్టెప్ బ్యాంకింగ్‌సేవల ఆప్షన్‌ను ఎంచుకోవలి. రిక్వెస్ట్ ఆప్షన్ కింద ఉన్న సేవింగ్స్ ఖాతాను ఎంచుకుంటే అందుబాటులో ఉన్న సేవలను ఇంటి వద్దనే పొందవచ్చు. మీకు కావాల్సిన సేవలను ఎంచుకంటే బ్యాంక్ ప్రతినిధులు ఇంటి వద్దకే వచ్చి బ్యాంకింగ్ సేవలను అందిస్తారు.

## 22న వజ్రోత్సవాల ముగింపు వేడుకలు: కమిటీ చైర్మన్ కేశవరావు

**హైదరాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త :** భారత స్వతంత్ర వజ్రోత్సవాల ముగింపు వేడుకలను ఈనెల 22న అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు కమిటీ చైర్మన్, ఎంపి కె.కేశవరావు తెలిపారు. ఎల్బీ స్టేడియం వేదికగా జరిగే ఈ కార్యక్రమానికి సీఎం కేసీఆర్‌తో పాటు సినీ గాయకుడు శంకర్ మహదేవన్, డ్రమ్స్ శివమణి, దీపికా రెడ్డి బృందంచే నృత్యం కార్యక్రమాలు ఉంటాయన్నారు. హాజరవుతారని వెల్లడించారు. బుధవారం బీఆర్కే భవన్‌లో జరిగిన సమావేశంలో మంత్రులు శ్రీనివాసగౌడ్, తలసాని శ్రీనివాస యాదవ్, హైదరాబాద్ నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఎమ్మెల్సీ ప్రభాకరరావు, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, భాషా సాంస్కృతిక విభాగం సలహాదారు రమణా చారి, సాహిత్య అకాడమీ చైర్మన్ జలూరు గౌరీశంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేశవరావు మాట్లాడుతూ ఈనెల 8 నుంచి నిర్వహిస్తున్న భారత స్వతంత్ర వజ్రోత్సవాల కార్యక్రమాలన్నింటినీ విజయవంతంగా నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులను అభినందించారు. ముగింపు సందర్భంగా దేశ స్వతంత్ర పోరాటం, దేశభక్తి ప్రధానంగా కార్యక్రమాలు ఉంటాయనీ వెల్లడించారు. పూర్తి కార్యక్రమాలు ఏ విధంగా ఉంటాయనేది జీఏడి కార్యదర్శి ఆధ్వర్యంలోని అధికారుల కమిటీ నిర్ణయిస్తుందన్నారు. ఈ ముగింపు కార్యక్రమానికి రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి దాదాపు 20 వేల మందికి పైగా హాజరు అవుతారని చెప్పారు.


ముగింపు వేడుకలపై సమీక్ష నిర్వహిస్తున్న కమిటీ చైర్మన్ కేశవరావు

## 22న ఆర్‌జీయూకేటీ ప్రవేశాల మెరిట్ లిస్టు
### ప్రకటించనున్న ఇన్‌ఛార్జ్ వీసీ వెంకటరమణ

**హైదరాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ఏకైక ట్రిపుల్ ఐటీ రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీ(ఆర్‌జీయూకేటీ)లో మెరిట్ లిస్టును ఈనెల 22న ప్రకటించనున్నారు. ఈ ఏడాది 2022-23 విద్యా సంవత్సరంలో యూనివర్సిటీలో ఈడబ్ల్యూఎస్ కోటాను అమలు చేయనున్నారు. మెరిట్ లిస్టును యూనివర్సిటీ ఇన్‌ఛార్జ్ వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ సోమవారం ప్రకటించనున్నారని డైరక్టర్ ప్రొఫెసర్ సతీష్ కుమార్ తెలిపారు. ఈ ఏడాది కూడా 1500 సీట్లను భర్తీ చేయనున్నారు. వీటిలో 96 సీట్లు స్పెషల్ కేటగిరీ సీట్లు కాగా మిగిలిన 1404 సీట్లలో రిజర్వేషన్లను అమలు చేయనున్నారు. 702 సీట్లు జనరల్‌లో ఉండగా 702 సీట్లను రిజర్వేషన్ల ద్వారా భర్తీ చేయనున్నారు. 702 జనరల్ సీట్లలో ఈడబ్ల్యూఎస్ కోటాలో 140 సీట్లను కేటాయించనున్నారు. వీటితోపాటు 75 గ్లోబల్ సీట్లు, 30 ఎన్ఆర్ఐ సీట్లు కూడా అందుబాటులో ఉండనున్నాయి.

## జీవిత బీమా పాలసీల పునరుద్ధరణకు ప్రత్యేక డ్రైవ్

**హైదరాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** ల్యాప్స్ అయిన పాలసీల పునరుద్ధరణకు జీవిత బీమా సంస్థ(ఎల్ఐసి) ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహిస్తోంది. ఈ నెల 17వ తేదీ నుండి అక్టోబర్ 21వ తేదీ వరకూ ఈ పాలసీల పునరుద్ధరణ క్యాంపెయిన్ జరుగుతుందని ఒక ప్రకటనలో తెలిపింది. ల్యాప్స్ అయిన పాలసీల పునరుద్ధరణలో అపరాధ రుసుములో ఆకర్షణీయమైన రాయితీ ఇవ్వబడుతుందని వెల్లడించింది. లక్ష రూపాయల వరకూ 2,500 రూపాయలు, లక్ష ఒక్క రూపాయలనుండి 3 లక్షల రూపాయల వరకూ 30 వేల రూపాయలు, 3 లక్షల ఒక్క రూపాయలకు పైబడి 3,500 రూపాయలు చొప్పున అపరాధ రుసుములో రాయితీలభిస్తుందని వివరించింది.అయితే ఈడ్రైవ్‌లో 5 సంవత్సరాల లోపు ల్యాప్స్ అయిన పాలసీల పునరుద్ధరించబడతాయని పేర్కొంది. షరతులకు లోబడి పాలసీల పునరుద్ధరణ జరుగుతుందని స్పష్టం చేసింది.

## కానిస్టేబుల్ అర్హత పరీక్షకు నేటి నుంచి హాల్ టికెట్ల డౌన్‌లోడ్

**హైదరాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** తెలంగాణ పోలీసు శాఖలో కానిస్టేబుల్ (సివిల్ తదితర) తత్సమాన పోస్టులతో పాటు అబ్కారీ శాఖలో కానిస్టేబుళ్ల భర్తీకి సంబంధించి భర్తీకి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు పోలీసు వెబ్‌సైట్‌లో నేటి నుంచి హాల్ టికెట్లు డౌన్ లోడ్ చేసుకునేందుకు పోలీసు నియామక మండలి ఏర్పాట్లు చేసిం ది. గురువారం ఉదయం ఎనిమిది గంటల నుంచి ఆగస్టు 26వ తేదీ అర్ధరాత్రి 12 గంటల వరకు అభ్యర్థులు తమ హాల్ టికెట్లను డౌన్ లోడ్ చేసుకునేందుకు వీలుంది. వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లు డౌన్ లోడ్ కాని పక్షంలో అభ్యర్థులు 9393711110 లేదా 9391005006కు ఫోన్ చేయాలని, సపోర్ట్ టిఎస్ఎల్ఆర్‌బికి మెయిల్ పం పవచ్చని మండలి చైర్మన్ శ్రీనివాసరావు తెలిపారు. వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్ డౌన్ లోడ్ చేసుకున్న తరువాత దానిపై అభ్యర్థులు తమ ఫోటోను అతికించాలని ఆ యన తెలిపారు. ఈ నెల 28వ తేదీన జరగనున్న కానిస్టేబుల్ అర్హత పరీక్షకు రాష్ట్ర వ్యాప్తంగా ఆరు లక్షల 61 వేల 196 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా ఇం దు కోసం 1601 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నాం ఒంటి గంట వరకు ఈ పరీక్ష కోసం ఉదయం తొమ్మిది గంటలకే అభ్యర్థులను పరీక్షా కేంద్రాలకు అనుమతించనున్నారు. పది గంటల తరువాత ఒక్క నిమిషం ఆల స్యమైనా అభ్యర్థులను అనుమతించబోమని మండలి చైర్మన్ తెలిపారు. పరీక్షా కేంద్రాలలో బ్యాగులు, సెల్‌ఫోన్లు,స్కానర్లు,వాచ్‌లు, క్యాలిక్యులేటర్లు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించమని, అభ్యర్థులు బ్లూలేదా బ్లాక్ బాల్ పెన్‌ను మాత్రమే తేవాలని ఆయన తెలిపారు. హాల్ టికెట్‌పై అభ్యర్థులు తమ పాస్‌పోర్టు సైజ్ ఫోటోను అంటించాలని, లేకుంటే పరీక్షా కేంద్రాలలో అనుమతించేదిలేదని ఆయన వెల్లడించారు. అభ్యర్థులుఎలాంటి టాటూలు వేసుకోరాదని, 200మార్కుల ప్రశ్నలకు ఎబిసిడిలువుంటాయని, నెగెటీవ్ మార్కులు వున్నందున సమాధానం తెలియని వాటిని వదిలివేయాలని ఆయన కోరారు. అభ్యర్థులు తమ పరీక్షాకేంద్రాలకు చేరుకుని, పరీక్షకోడ్‌ను ముందుగానే ఎంపిక చేసుకోవాలని,పరీక్షాకేంద్రాలలో తాగేందుకు నీరు అందుబాటులో వుంటుందని, పరీక్ష ముగిసేవరకు అభ్యర్థులు అక్కడే వుండాలని ఆయన తెలిపారు.



## గోవును జాతీయప్రాణిగా ప్రకటించాలి
### అఖిలభారత గోసేవ మహాపాదయాత్ర

**తిరుపతి,ఆగస్టు 17ప్రభాతవార్తప్రతినిధి:** హిందూ సనాతనధర్మంలో 16వేల దేవతలు కొలువైన గోమాతను పవిత్రంగా పూజించి ,ఆరాధించే గోవును జాతీయప్రాణిగా గుర్తించాలని టిటిడి పాలకమండలి తీర్మానం చేసింది. ఈతీర్మానాన్ని బలపరుస్తూ అఖిల భారత గోసేవ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బాలకృష్ణ గురుస్వామి, యుగతులసీ వ్యవస్థాపకుడు శివకుమార్, టిటిడి బోర్డు సభ్యుడు మూరంశెట్టిరాములు 40మంది రైతులతో చేపట్టిన గోమహాపాదయాత్ర బుధవారం రాత్రి తిరుపతికి చేరింది. తిరుపతిలో టిటిడి బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్ సాదర స్వాగతం పలికారు.

గోవును జాతీయప్రాణిగా ప్రకటించేందుకు అందరూ కలసి కృషి చేద్దామన్నారు. గోవులను రక్షించాలని, గో ఉత్పత్తులు, గో ఆధారిత వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని హైదరా బాద్ నుంచి మహాపాదయాత్ర 20 రోజులు 565 కిలోమీటర్లు సాగి తిరుపతికి చేరింది. గురువారం ఉదయం ఈ మహాపాదయాత్ర తిరుమలకు చేరుకుంటుంది.

## ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ మూల్యాంకన కేంద్రాల తనిఖీ: బోర్డు కార్యదర్శి జలీల్

**హైదరాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** ఈ నెల 13 నుంచి ప్రారంభమైన ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ మూల్యాంకన కేంద్రాలను ఇంటర్ బోర్డు కార్యదర్శి సయ్యద్ ఉమర్ జలీల్ బుధవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. మూల్యాంకన కేంద్రాలు ఎలలా కొనసాగుతున్నాయని బోర్డు కార్యదర్శి జలీల్ పరిశీలించారు. సెక్రటరీతోపాటు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామ్స్(సీవోఈ) అబ్దుల్ ఖాలీక్, జాయింట్ సెక్రటరీ వై శ్రీనివాస్ ఉన్నారు. కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఏర్పాటు చేసిన క్యాంపును పరిశీలించారు. ఈ నెల 1నుంచి 10 వరకు ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జరిగిన సంగతి తెలిసిందే. పరీక్షలు ముగిసిన అనంతరం ఈ నెల 13 నుంచి మూల్యాంకనం ప్రారంభమైంది.13న కొన్ని సబ్జెక్టులు, 16న కొన్ని సబ్జెక్టులు, 18న కొన్ని సబ్జెక్టుల మూల్యాంకనం ప్రారంభించనున్నట్లు ఇంటర్ బోర్డు మొదట ప్రకటించింది. అయితే 13న కొన్ని సబ్జెక్టులు ప్రారంభం కాగా మిగిలిన అన్ని సబ్జెక్టులు కూడా 16న ప్రారంభించారు. మూల్యాంకనానికి ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీల నుంచి అధ్యాపకులు రాకపోవడంతో అందరూ ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేసే రెగ్యులర్, కాంట్రాక్ట్ లెక్చరర్లతో మూల్యాంకనాన్ని కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లోబోధన చేయాల్సిన అధ్యాపకులు అందరూ ప్రస్తుతం మూల్యాంకనం విధుల్లో ఉండటంతో రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో బోధన జరగడం లేదని ఇలాగైతే ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదివే పేద విద్యార్థులు నష్టపోతారని తెలంగాణ ఇంటర్ విద్యా పరిరక్షణ సమితి ఆందోళన వ్యక్తం చేసింది. ఇంటర్ బోర్డు అధికారులు ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఇంటర్ విద్యా పరిరక్షణ సమితి కన్వీనర్లు మాచర్ల రామకృష్ణ గౌడ్, డాక్టర్ కొప్పిశెట్టి సురేష్, సమన్వయకర్త ఎం జంగయ్య విమర్శించారు.

తెలంగాణ ప్రభుత్వం
రోడ్లు మరియు భవనముల శాఖ, నిజామాబాద్ సర్కిల్, నిజామాబాద్.
'ఇ'ప్రొక్యూర్‌మెంటు టెండరు ప్రకటన
నిట్ నం.35/2022-23, తేదీ: 10.08.2022 ద్వారా సైడు కాలువల నిర్మాణం అనగా '1' పని కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంటు ప్లాట్‌ఫారం క్రింద ఆన్‌లైన్ టెండర్లు ఆహ్వానించబడుతున్నాయి. టెండరుదారులు టెండరు పెడ్యూళ్ళను ఇ-మార్కెట్ ప్లేస్ అనగా https://tender.telangana.gov.in నుండి 17.08.2022 సా.5.00గం. నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. పని కొరకు టెండర్ల స్వీకరణకు చివరి తేదీ: 24.08.2022 సా.5.00గం.వరకు లేదా ఆలోగా. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంటు మార్కెట్‌ప్లేస్ అనగా https://tender.telangana.gov.in వద్ద చూడవచ్చును.
సం/-.సూపరింటెండింగ్ ఇంజనీర్,(ఆర్‌అండ్‌బి) సర్కిల్,నిజామాబాద్.
DIPR.No.1289-DP/CL/Advt/1/2022-23 తేదీ: 17.08.2022

